
*ప్రవాహంలో కర్రపుల్లలు కలుస్తూ విడిపోతూ వుంటాయి. రైల్లో ప్రయాణికులు యెవరెవరి స్టేషన్లో వారు దిగిపోతారు. ఆ విడిపోవడం, కలవడాల మధ్య పన్నీటికీ కన్నీటికీ వున్నంత తేడా వుంటుంది మరి!*

# యథాకాష్ఠంచ కాష్ఠంచ...

'జనకోజని



కిటికీలోంచి బయటకు చూస్తున్న ఆనంద రావు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. ప్లాట్ ఫారం కోలాహలంగా వుంది. రైలు ఎక్కేవాళ్ళూ, దిగేవాళ్ళూ కూడా ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ, అటు ఎక్కటానికీ, ఇటు దిగటానికీ కూడా అంతరాయం కలిగిస్తున్నారు. మరికొందరు పరుగులాంటి నడకతో ప్లాట్ ఫారం పొడుగుని కొలవటానికి ప్రయత్నిస్తున్నారు. ట్యూబ్ లైట్ల వెలుగులో అది పగలేమోననిపించేటట్లుగా వుంది ప్లాట్ ఫారం. ఏ విధమైన కంగారు లేకుండా వేదాంతుల్లా తిరుగుతున్నారు కాఫీ, టీ అమ్మేవాళ్ళు.

ఆనందరావు మళ్ళీ ---శాడు.

అరుంధతి నాలుగేళ్ళ పిల్లాణ్ణి నడిపించుకుంటూ రైలు పెట్టెలో అడుగుపెట్టటానికి ప్రయత్నిస్తోంది. సందేహంలేదు అరుంధతే! ఆనందరావుకి గుండె ఆగినంత పనయింది. గత ఐదారేళ్ళలోనూ ఆనందరావు అరుంధతిని తల్చుకోనిరోజు లేదు. ఐనా ఇవ్వాళ అరుంధతి తటస్థపడితే సూటిగా ఆమె మొహంలోకి చూసే ధైర్యం లేదు ఆనందరావుకి.

"కొంపతీసి ఇక్కడికే వచ్చెయ్యదు గదా!" భయపడుతూ అనుకున్నాడు ఆనందరావు. అప్రయత్నంగా అతని చేతులు మఫ్లర్ తీశాయి. అవటానికి అది చలికాలమే అయినా, రైలు స్టేషన్ లో ఆగటంవల్ల నిజానికి ఇంత క్రితం వున్న చలి ఇప్పుడు లేనేలేదు. ఐనా, ఆనందరావు మఫ్లర్ తలకి చుట్టేయటం, ఒక్క ఉదుటున పై బెర్త్ మీదకు చేరి దుప్పటి ముసుగుపెట్టటం క్షణంలో జరిగిపోయాయి.

ఆనందరావు మనస్సునంతా అరుంధతి ఆక్రమించుకుంది.

అరుంధతి!

కళ్ళు తిప్పటంలోనూ, అతి వయ్యారంగా నడవటంలోనూ లేడిని జ్ఞాపకం చేసే అరుంధతి. కొంత పరిచయం అయాక ఆ మాటే అన్నాడు ఆమెతో. "ప్రబంధ కవులు అందమైన అమ్మాయిల కళ్ళని లేడి కళ్ళతో పోల్చటంలో







# మీరు చెప్పినట్లు వినే బంతి

ఒకసారి నేనూ, నా స్నేహితులూ, నా అసిస్టెంటు 'రాజు', అందరం కలసి ఎగ్జిబిషను చూసేందుకు వెళ్ళాం. ఎగ్జిబిషన్‌లో మా బృందంలోని ఒక డాక్టరు బంతి నొకదానిని కొన్నారు.

ఆ బంతిని చూస్తున్న నన్ను, మావాళ్ళలోని ఒకతను మిత్రమా నువ్వు ప్రఖ్యాత ఇంద్రజాలికుడవుగదా, ఈ బంతితో ఒక మ్యాజిక్ చేసి చూపించగలవా? అని నవ్వుతూ ప్రశ్నించాడు.




ఒక క్షణం ఆలోచించి, సరేనని ఆ బంతిలోకి ఒక త్రాటిని దూర్చాను తరువాత త్రాటి కొసలను రెండు చేతులతో పట్టుకొని, చూడండి ఈ బంతి పై చేతి నుంచి క్రిందనున్న చేతి వరకూ మెల్లగా జారుతూ వుంటుంది. మీలో ఎవరయినా "స్టాప్" అంటే మాత్రం ఆగిపోతుంది అని అన్నాను. బంతి జారుతుండగా మిత్రులు కొందరు "స్టాప్" అన్నారు. అలా వారు స్టాప్ అన్నపుడల్లా బంతి ఆగిపోయి, తరువాత జారుతూ వచ్చింది. ఈ వింతను చూసి మిత్రులందరూ ఆశ్చర్యంతో, చప్పట్లుకొట్టి అభినందించారు.

"గురూ! దీంట్లో వున్న రహస్యమేమిటి?" అని ఒకతను అడిగాడు. నిజానికి యిందులో ప్రతిభ ఏమీలేదు.

ముందుగా బొమ్మలో చూపినట్లుగా, A B అన్న త్రాడును బంతికి రంధ్రాలు చేసి దూర్చాలి. ఆ తర్వాత A B లో చూపినట్లుగా బంతికి రంధ్రం చేసేటప్పుడు, చిన్న రేకు గొట్టాన్ని తీసుకొని బంతిలోకి బొమ్మలో చూపినట్లుగా దూర్చాలి. ఆ గొట్టాన్ని కొద్దిగా C వరకూ వంచాలి. ఆ గొట్టంగుండా త్రాడు A నుండి B కి రంధ్రముద్వారా దూర్చాలి. మిత్రులు "స్టాప్" అన్నపుడు త్రాటిని గట్టిగా బిగించి పట్టాలి అప్పుడు వంపుగా వున్న గొట్టం బంతిని నొక్కడంవలన బంతి కదలకుండా ఆగుతుంది. తిరిగి వదిలి చేసినపుడు మెల్లమెదిగా క్రిందకు జారుతుంది. ఇలా ఎన్నిమార్లయినా ఈ వింతను చేసి చూపించవచ్చు.

మెజీషియన్—

కె.బి. విరాట్‌వాలా, వినుకొండ

ఔచిత్యం నాకు నిన్ను చూశాకే అర్థమయింది అరుంధతీ" అని. అరుంధతి తన కళ్ళని మరింత అందంగా తిప్పుతూ అంది "ఈ లేడిని ఆ పెదపులి బారినుంచి రక్షించి మీరే పుణ్యం కట్టుకోవాలి" ఈ మాటలంటున్నప్పుడు అరుంధతి దృష్టి భీమశంకరంగారి మేడపై వుంది.

మొన్ననో, నిన్ననో జరిగినట్లున్న ఈ సంఘటన జరిగి ఐదారేళ్ళు కావస్తోంది. ఆనందరావు దుప్పటి కొంచెం పక్కకితీసి కిందకి చూడటానికి ప్రయత్నించాడు. అరుంధతి పిల్లవాణ్ణి వొళ్ళో పెట్టుకుని కిటికీ దగ్గర కూచుంది. "ఒకవేళ అరుంధతి కాదేమో!" ఆనందరావు మళ్ళీ పరీక్షగా చూశాడు. అతని ఒళ్ళు జలదరించింది. ఇరవై ఏళ్ళయినా నిండని అరుంధతి నలభై ఏళ్ళదానిలా వుంది. అదలావుంచి, కట్టుకున్నది రంగుచీరే అయినా, గాజులూ బొట్టూ లేని ముఖం ఆనందరావు మనస్సుని కోచి లెంపకాయ కొట్టింది.

రైలు కూత కూసి ముందుకుపోతూంటే ఆనందరావు మనస్సు వెనక్కి ప్రయాణించటం మొదలుపెట్టింది. దగ్గరగా వుంటుందిగదా అని తండ్రి యం.ఏ. చదువుకి ఆనందరావుని ఏలూరు కాలేజీలో చేర్పించాడు. ఆ మాటకొస్తే అతనికి ఏ ఉద్యోగం చెయ్యకపోయినా ఐదారు తరాలదాకా తరగనంత ఆస్తివుంది. ఐనా అందరిలా కాకుండా విద్య, జ్ఞానంకోసమే ననే దృష్టితో ఆనందరావు లిటరేచర్ ఎం.ఏ చదవటం ప్రారంభించాడు నలుగురితో కలిసి తిరగటంగాని, ఆధునికంగా అలంకరించుకోవటంగాని ఇష్టంలేని ఆనందరావు జన్మతః తాత్వికుడు. ప్రతి విషయాన్నీ లోతుగా తరచి చూడటం అతనిస్వభావం. అందరికీ సర్వసామాన్యంగా కనిపించే విషయంలో ఏదో నిగూఢ భావం అతనికి గోచరిస్తుంది. అందుకనే వూరికి దూరంగా వున్న అశోకనగర్‌లో, ఏటి ఒడ్డున మేడ మీది గది అద్దెకు తీసుకున్నాడు అతను. హాయిగా, ప్రశాంతంగా వుండాలనీ, సహజంగా పట్టణంలో వుండే రణగొణ ధ్వనులతో తన చెవులు చిల్లులు పడకూడదనీ అతని అభిలాష. అతని ఆలోచనలకీ ఆశయాలకీ అనుగుణంగా అతనికి మేడమీద వున్న ఒకే ఒక గది దొరికింది. అందులోనూ మేడ క్రింది భాగంలో ఏదో ఆఫీసు వుండటంచేత, రాత్రిపూట అసలే అలజడి వుండేదికాదు. పగలు ఆఫీసు పని చేసే కాలంలో తనకు కాలేజి వుండటం. ఆఖరికి కాలేజికి సెలవు వచ్చినప్పుడల్లా ఆఫీసు మూసి వుండటంతో అతనికి కోరుకున్న ఏకాంతవాసం లభించింది. ప్రశాంతంగా రోజులు దొర్లిపోతున్న సమయంలో వున్నట్టుండి ఆనందరావు జీవితపు తలుపులు తెరచుకుని అరుంధతి లోపల ప్రవేశించింది.

సాయంకాలం, గదిముందు వరండాలో ఏదో ఆలోచిస్తూ పచార్లు చేస్తున్న ఆనందరావు పిట్టగోడ దగ్గరనుంచి ఒకసారి కిందకి చూశాడు. సహజంగా ఆకాశంలో వుండే తటిల్లత తన డాబా పక్కనవున్న పూరింటిముందు మెరిసింది. ఆనందరావు మనస్సులో రంగుల హరివిల్లు విరిసింది. ఆనందరావు యౌవనంలో ఉన్నవాడే

అయినా, అతనెప్పుడూ ఏ ఆడపిల్లనీ పరీక్షగా చూడలేదు. అలాంటిది ఆ పూరింటి ముందు రంగవల్లులు దిద్దుతున్న అరుంధతి అతని కంటికి ఓ దేవకన్యలా కనిపించింది. అతను చరాచరమైన సమస్త ప్రపంచాన్నీ మరచిపోయి ఆమెనంకే చూస్తూ వుండిపోయాడు. వున్నట్లుండి ఆమె కూడా తన చూపులు పైకి ప్రసరింపచేయటంతో ఆనందరావు సభ్యతని గుర్తించి పక్కకి తప్పుకున్నాడు. ఇది జరిగిన నాటినుంచీ ఆ గదిలో ఆనందరావు, అతని మదిలో అరుంధతీ వుంటూ వచ్చారు.

ఆనందరావు మళ్ళీ దుప్పటి కొద్దిగా పక్కకితీసి చూశాడు. అరుంధతి కిటికీలోంచి శూన్యంలోకి చూస్తోంది.

“ఎక్కడిదాకా వెళుతున్నారు?” పక్కనున్న బామ్మగారు అరుంధతితో స్నేహం కలపటానికి ప్రయత్నిస్తూ అంది.

“రాజమండ్రి” అరుంధతి ముక్తసరిగా సమాధానం చెప్పింది. ఆనందరావు సందేహం తీరిపోయింది. తనకెంతో పరిచయమైన గొంతు. నిదాఘతప్తమైన తన మనస్సుమీద ఎన్నిసార్లో పన్నీరు చల్లిన గొంతు. ఆనందరావు మళ్ళీ దుప్పటిలోకి వెళ్ళిపోయాడు. అందమైన ఆడపిల్లలు తాడుని రెండు చేతులతో పట్టుకుని తిప్పుతూ, కాళ్ళ దగ్గరకి వచ్చినప్పుడల్లా గెంతుతూ స్కిప్పింగ్ ఆట ఆడతారు. ఆనందరావు మనస్సు కాలాన్ని తాడుగా చేసుకుని అలాంటి వలయాలు సృష్టిస్తోంది.

తను ఆ గదిలో చేరిన కొద్ది రోజులకే అరుంధతిని గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు ఆనందరావు. క్రింది అంతస్తులో వుండే ఆఫీసుకి రాత్రిళ్ళు కాపలాకాసే వీరన్న అప్పుడప్పుడు వచ్చి తన కష్టసుఖాలతోపాటు అరుంధతి కష్టసుఖాలూ వివరించేవాడు. అరుంధతి తండ్రి వ్యాపారం చేసుకునేవాడు. వున్నట్టుండి చనిపోవటంతో కుటుంబం వీధిన పడిందని, పార్వతమ్మ భర్త మిగిల్చి వెళ్ళిన ఆ పూరింట్లో వుంటూ, ఆయనకి ప్రతిరూపాలైన కూతుర్నీ కొడుకునీ సాకటానికి పొరుగింటి రిటైర్డ్ తాసిల్దారు భీమశంకరం గారింట్లో వంటకు కుదిరిందని వీరన్న చెప్పినప్పుడు ఆనందరావు హృదయం సానుభూతితో నిండిపోయింది.

తన గదిముందు పచార్లు చేస్తున్న ఆనందరావుకి మరో దృశ్యం కనిపించింది. దూరంగా ఏటి వొడ్డున ఏదో శవం కాలుతోంది. ఐదారుగురు మనుష్యులు యాంత్రికంగా తమ పని తాము నిర్వర్తిస్తున్నారు. పాతిక సంవత్సరాలు దగ్గర పడుతున్నా శవదహనాన్ని గురించి వినడమేగాని ప్రత్యక్షంగా చూడని ఆనందరావు ఆలోచనల్లో మునిగిపోయాడు. ఆ రాత్రి ఈ విషయం ప్రస్తావించినప్పుడు అతి తేలికగా తీసిపారేస్తూ అన్నాడు వీరన్న- “అదా బాబూ! మీకీ ఇలు ఇంకా కొత్త కాబట్టి అలా వుంది గాని నేను ఈ మేడమీదనుంచి యెన్ని వందల శవాలు కాలటం చూశానంటారు? ఈ రెండు మేడల్లో ఏ మేడ ఏరోజు యెక్కినా ఏదో ఓ శవం కాలుతూ కనబడితీరుతుంది. క్రమక్రమంగా మీ మనస్సూ బండబారిపోతుందిలెండి.” తాపీగా చుట్ట కాల్చుకుంటూ అన్నాడు వీరన్న.

ఆనందరావుకి వీరన్న జ్ఞాపకం వచ్చాడు. ఒక్క వీరన్న అనే ఏమిటి, తను అశోకనగర్‌లో మేడమీది గదిలో గడిపిన రెండేళ్ళలోనూ తనకు పరిచయమైన వాళ్ళంతా మరోలోకం నుంచి వచ్చిన మనుష్యులేమో ననిపించింది ఆనందరావుకి.

పక్కకి ఒత్తిగిలి బామ్మగారికీ అరుంధతికీ మధ్య జరుగుతున్న సంభాషణ వినటానికి ప్రయత్నిస్తున్న ఆనందరావు మనస్సులో ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుగులో తనకీ అరుంధతికీ




ఊరగాయలకు అమూల్యమైన నూనెలు

అగ్ మార్కు కాబడిన

A. S. బ్రాండ్ పప్పునూనె

మేన్షను బ్రాండ్ నువ్వుల నూనె

ఊరగాయలను మెత్తబడనీయవు. బూజు పట్టనీయవు.
చాలాకాలము నిల్వయుండును. అమితమగు రుచిని కలుగజేయును.

16, 4, 2 కేజీల డబ్బాలలో ప్యాకింగ్ చేయబడుచున్నవి.
ఇండియన్ గవర్నమెంటువారి అగ్‌మార్కు సీలును గమనించుకొనుడు.

డిపోలు: * డా॥ వుళక్కి స్ట్రీటు, తెనాలి ఫోన్: 150
* 1-3-166 రాజా మొదలియార్ స్ట్రీటు
కలాసిగూడ, సికింద్రాబాద్ ఫోన్: 76160

బళ్లారి, గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల. బరంపురం, కలకత్తా, జెంషెడ్‌పూర్, నాగపూరులలో మా ఏజంట్లుగలరు.

Manufacturers, స్థాపితం 1910

అంబటి సుబ్బన్న అండ్ కో., సామర్లకోట

ఇండియాలోకెల్ల పెద్ద అగ్‌మార్కు జింజిలీ ఆయిలు ప్యాకర్సు

మధ్య స్నేహం ఏర్పడి వృద్ధిపొందటం. ఒక సినిమా రీలు కనిపించింది.

అవ్వాళ ఆనందరావు ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. తలుపు తాళంవేసి వుండటంవల్ల పనిమనిషి, క్యారియర్ అరుంధతి వాళ్ళ ఇంట్లో పెట్టి వెళ్ళింది. ఆ క్యారియర్ ఇవ్వటానికి తన ప్రాంగణంలో అడుగుపెటిన అరుంధతి అతని హృదయ ప్రాంగణంలో స్థిర నివాసం ఏర్పరచుకుంది.

"మీకేం కావలసినా మొహమాట పడకుండా అడగమంది అమ్మ" అరుంధతి కిన్నెర మీటింది. ఆనందరావు హృదయం పురివిప్పి నాట్యం చేసింది. అలా మొదలైన పరిచయం త్వరలోనే వాళ్ళిద్దరి మనస్సుల్ని దగ్గరకు చేర్చింది ఒకసారి డాబా మీదనుంచి దూరంగా కాలుతున్న శవాన్ని అరుంధతికి చూపిస్తూ అన్నాడు ఆనందరావు "చూశావా అరుంధతీ, మన మందరం రైలు ప్రయాణీకులం. అందరం ఒకరైలే యెక్కినా యెవరివూరు రాగానే వాళ్ళం దిగిపోతాం. చిత్రమేమిటంటే. ఈ రైల్లోనే శాశ్వతంగా వుండిపోయే వాళ్ళెవరూ లేరు." ఈ మాట లంటున్నప్పుడు రామాయణంలో దశరధుని మరణవార్త విన్నప్పుడు రాముడన్న "యధా కాష్టంచ కాష్టంచ" శ్లోకం జ్ఞాపకం వచ్చింది ఆనందరావుకి.

ఆలోచనలలో మునిగిపోయిన ఆనందరావు తన జీవిత గ్రంథంలో మరో పేజీ తిప్పాడు.

చాలా కాలం తరువాత ఒక రోజు రాత్రి పిచ్చాపాటీ మాట్లాడుతూ వీరన్న అన్నాడు ఆనందరావుతో. "చూశారా బాబూ భీమ శంకరంగారి దుర్బుద్ధి. భార్యపోయి పాతికేళ్ళు దాటాక. ఇప్పుడు పెళ్ళి చేసుకుంటాట్ట పార్వతమ్మకంటె పెద్దది ఆయన కూతురు లక్షణంగా పిల్లల్ని కని భర్తతో సుఖంగా జీవిస్తోంది. అలాంటివాడు తన మనుమరాలి వయస్సున్నఅరుంధతమ్మను మనువాడతాట్ట. కలియుగం బాబూ కలియుగం"

ఈ వార్త ఆనందరావుకి ఆశనిపాతమే అయింది. అయినా తన ఆందోళన పైకి కనబడనీకుండా అన్నాడు. "భీమశంకరం గారు అంత మునలాడంటావా?"

"ముసలాడా అంటారేమిటి బాబూ. ఇదరం ఒకే యీడువాళ్ళం. కాటికి కాళ్లు చాచుకున్న వాళ్ళం మీ పరీక్షలైపోయి మీరు వెళ్ళిపోతారు కాబట్టిగాని, లేకపోతే యిదేయేటి వొడ్డున మా శవాలూ కాలిపోవటం యిదే మేడమీదనుంచి చూస్తారు మీరు."

అంత ప్రగాఢమైన సత్యాన్ని యెంత తేలికగా చెప్పాడు వీరన్న 'గబగబా పేజీలు తిప్పాడు ఆనందరావు ఒకనాటి దృశ్యం మళ్ళీ ఆనందరావు కళ్ళముందు మెదిలింది

తన గదిముందు పిట్టగోడ దగ్గర తను.

తనివంక ఆనందంతో ఆశగా చూస్తున్న లేడిపిల్ల

లేడిపిల్లమీద కన్నువేసి దూకటానికి సిద్ధంగా వున్న మేడమీది పెద్దపులి.

ఆనందరావు ఒళ్ళు జలదరించింది. అతని కళ్ళు అశ్రువుల్ని వర్షిస్తున్నాయి. ఒక్కసారి బెర్త్ దిగి అరుంధతి కాళ్ళని తన కన్నీటితో కడిగితే."

ఆలోచనని ఆచరణలో పెట్టలేని పిరికి తాత్త్వికుడు ఆనందరావు. అతని మనస్సు చివరి పేజీ తిప్పింది.

కోర్సు పూర్తయిపోయి మర్నాడు బయల్దేర బోతున్నాడు తను, అవాళ ఇంటికి ఆలస్యంగా వచ్చాడు అనందరావు. గేటు తీసి లోపలికి ప్రవేశించబోతుండగా ఆ దారిని వెళుతున్న భీమశంకరంగారు తననిచూసి ఆగాడు. ఆనందరావు ఆయన వంక చూశాడు. తెల్లని మడత నలగని లాల్చి. మనసులోని ఊహల రంగునే సంతరించుకున్న నల్లనిజుట్టూ, "విన్నారా? పాపం నైట్ వాచ్‌మన్ వీరన్న మధ్యాహ్నం పోయాట్ట. ఓ గంట క్రితమే తీసుకుపోయారు."

అతి విషాదకరమైన వార్తని అతి సాధారణంగా చెప్పాడు భీమశంకరంగారు. ఆనందరావు నిర్ఘాంత పోయాడు! ఓ వారం రోజులనుంచీ తనకు వీరన్న కనబడటం లేదు అతని వంట్లో బాగుండలేదని కూడా విన్నాడు తను. ఐనా యింతత్వరలో తన మాటల్ని నిజంచేస్తూ వెళ్ళిపోతా డనుకోలేదు తను.

ఇంట్లో ప్రవేశించబోయిన ఆనందరావు వెనక్కి తిరిగి ఏటివైపు నడచాడు. ఇంచుమించు ప్రతిరోజూ తన మేడమీదనుంచి చూసే దృశ్యాన్ని ఈసారి అతి దగ్గర నుంచి చూశాడు అందులోనూ ఇప్పుడు కాలిపోతున్న శరీరం రెండేళ్ళుగా తనతో కష్టసుఖాలు చెప్పుకుంది.

ఆనందరావు గదికి తిరిగి వచ్చాడు. కళ్ళముందు మళ్ళీ ఏవేవో దృశ్యాలు.

పక్క మేడమీదనుంచి లేడిపిల్ల మీదకు దూకటానికి సిద్ధంగా వున్న పెద్దపులి.

పెద్దపులి బారినుంచి తప్పించుకోలేని నిస్సహాయస్థితిలో తనవంక దీనంగా చూస్తున్న లేడిపిల్ల.

కాలుతున్న శవాన్ని చూస్తున్న తను.

ఆనందరావు మనస్సులో ఆలోచనల అలలు. ఓ పక్కన దీనంగా తనవంకే నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తున్న అరుంధతి. మరోపక్క కష్టాలూ, బాధలూ, భయాలూ, వ్యాధులూ తరుముకొస్తూంటే తప్పించుకోలేక మృత్యుదేవత కరాళ దంష్ట్రలవైపు పరుగెడుతున్న అసహాయులు.

ఆనందరావు సమస్యని త్వరగానే పరిష్కరించాడు. అతనిలోని మానవుణ్ణి అతనిలోని తాత్త్వికుడు జయించాడు. తన మనస్సుకి ఒక ఉత్తరం రూపాన్నిచ్చి, దానిని, అరుంధతికి అందజేసే ఏర్పాటు చేసి, రాత్రికి రాత్రి గది కాళీచేసి చీకట్లోకి నడిచిపోయాడు ఆనందరావు.

రైలు కొత్త శబ్దంచేస్తూ ముందుకు సాగిపోతోంది. శబ్దంలో వచ్చిన మార్పుని బట్టి రైలు గోదావరి వంతెనమీదనుంచి పోతున్నట్లు గ్రహించాడు ఆనందరావు. ఇంక కొద్దిసేపటో అరుంధతి దిగిపోతోంది. ఆనందరావు ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటున్నాడు. బామ్మగారి మాటలు మధ్యలో వినిపించాయి ఆనందరావుకి. "మీరు రాజమండ్రిలో దిగిపోతే నేను సామర్లకోటలో దిగిపోతాను. ఇంకెంతసేపు. ఓ గంట. ఎవరి స్టేషన్ వచ్చినప్పుడు వాళ్ళు దిగక తప్పుతుందా."

బామ్మగారు చెప్పుకుపోతోందిది ఏదో జ్ఞాపకం వచ్చిన అరుంధతి కళ్ళల్లో నీళ్ళు. అరుంధతి స్మృతిలో మెదలిన సంఘటనే ఆనందరావు మనస్సులోనూ మెదిలింది. ఒక్కక్షణం గడిచింది. అరుంధతి పిల్లవాణ్ణి ఎత్తుకుని దిగటానికి లేచింది. "పిలవాణ్ణెత్తుకుని వున్నావు. జాగ్రత్తగా దిగమ్మా- నేనుంటాను." కొద్ది గంటల పరిచయమే అయినా ఆత్మీయత పుట్టిపడుతోంది బామ్మగారి మాటల్లో. "ఇంతకీ బాబు పేరేమిటన్నావు?"

అడుగు వెట్టుమీదనుంచి ప్లాట్‌ఫారం మీద కాలుపెడుతూ అంది అరుంధతి. "ఆనందరావు."

ఆనందరావు కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. అవి దుఃఖాశ్రువులా, ఆనంద బాష్పాలా అన్న జిజ్ఞాసలో పడ్డ ఆనందరావు, అరుంధతి వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాడు.

ప్లాట్‌ఫారం కోలాహలంగా వుంది. రైలు ఎక్కేవాళ్ళూ దిగేవాళ్ళూకూడా అటు ఎక్కటానికీ యిటు దిగటానికీ అంతరాయం కలిగిస్తూనే వున్నారు. ★

